క్లుప్తంగా

వైభవంగా అయ్యప్పస్వామి విళక్కి మహోత్సవం



భజన చేస్తున్న అయ్యప్పస్వాములు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు శ్రీ దుర్గా సమేత భోగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో విళక్కి మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు మేడవరం రాఘవేంద్ర ఆధ్వర్యంలో గణపతి పూజ, అభిషేకం, విశేష పూజలు, మంగళ హారతులు ఇచ్చి పట్టువస్త్రాలు, పూలచే ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అయ్యప్ప స్వాములు భక్తిపాటల భజన కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించి ట్రాక్టర్‌పై ఆశీనులు గావించి గ్రామంలో అయ్యప్ప మాలధరణ ధరించిన స్వాములు భక్తిపాటలు పాడుకుంటూ వాయిద్యాలతో గ్రామోత్సవం చేశారు. స్వామి వారికి మహిళలు కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కూటమి నాయకుడి వెంటే పోలీసులు



ముడివేములలో కూటమి నాయకుడి వెంట నడుస్తున్న ఎస్సై

యర్రగొండపాలెం: నియోజకవర్గ ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేకు పోలీసులు రక్షణ కల్పించడం లేదు. ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి ఎన్నికల్లో ఓడిపోయిన కూటమి నాయకుడి వెంటే పోలీసులు తిరుగుతున్నారు. అదే పంథాలో అధికారులు సైతం నడుస్తున్నారు. శనివారం త్రిపురాంతకం మండలం ముడివేములలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన టీడీపీ నాయకుడు ఎరిక్షన్‌బాబుకు పోలీసులు ప్రొటోకాల్ పాటించారు. అక్కడ ఆయనకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. త్రిపురాంతకంలోని ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను ఆహ్వానించకుండా ఎటువంటి అధికారం లేని ఎరిక్షన్‌బాబును ఆహ్వానించి ఆయనతో దుప్పట్లు పంపిణీ చేయించారు. యర్రగొండపాలెంలో జరిగిన సబ్ పోస్టాఫీసు ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు పోలీసులు ఎటువంటి రక్షణ కల్పించలేకపోవడంపై ప్రజలు విస్తుపోతున్నారు.

అపార్‌తో తల్లిదండ్రుల అవస్థలు

● కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



అపార్ నమోదును పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

పెద్దారవీడు: విద్యార్థుల వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేసే ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రులకు శిరోభారంగా మారింది. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులతో బిజీబిజీగా ఉండే విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయం, కూలీ పనులు మానుకుని మీ సేవా కేంద్రాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని సేవలకు సంబంధించిన పనులు శరీరానికి చెమట పట్టకుండా కష్టం ఏమీ కలగకుండా ఎవరి చుట్టూ ప్రదక్షిణలు లేకుండా వలంటీర్ల ద్వారా పనులు జరిగేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ఏ పనులు జరగాలన్నా పలు పర్యాయాలు కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు చదువుకునే పాఠశాలలో రికార్డుల ప్రకారం ఆధార్ ఉంటే అపార్ కార్డు పొందడం సులభతరం. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులే అప్‌లోడ్ చేసేస్తారు. పాఠశాల రికార్డులు, ఆధార్ కార్డులో తేడాలు ఉంటే అవస్థలు తప్పడం లేదు. మండలంలో పాఠశాలలు, కళాశాల 62 ఉన్నాయి. మొత్తం విద్యార్థులు 6,169 మంది ఉండగా ఇంత వరకు జనరేట్ అయినవి 4209 మంది విద్యార్థులు. మిగిలిన విద్యార్థులు ఆధార్ కార్డు సమస్యతో జాప్యం జరుగుతున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఆధార్ వెళ్లి అపార్ వచ్చింది

ఇంత వరకూ ఆధార్ కార్డు ఉండాలి అన్నారు. ఇప్పుడు కొత్తగా అపార్ కార్డు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పూర్తి వివరాల నమోదు కోసం అపార్ కార్యక్రమాన్ని చేపట్టింది. అపార్ నమోదుతో ప్రతి విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పొందాలి. జనన ధ్రువీకరణ పత్రం ఆధారంగానే ఆధార్ కార్డులో తప్పులు ఏమైనా ఉంటే వాటిని సవరించి అపార్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంది. ఇందు కోసం తమ పిల్లలు చదువుతున్న పాఠశాలలకు వెళ్లి అక్కడ విద్యార్థి పుట్టిన తేదీ వివరాలతో కూడిన స్టడీ సర్టిఫికెట్ తీసుకోవాలి. స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌లో పుట్టిన తేదీలు సరిగా ఉంటే అటువంటి వారికి ఎలాంటి ఇబ్బంది లేదు. ఆ రెండింటిలో తేడాలు ఉంటే మాత్రం జనన ధ్రువీకరణ పత్రం కావాలి. దీనికి సంబంధించిన ఆర్డీఓ ప్రొసీడింగ్ వచ్చిన తర్వాత పంచాయతీ కార్యదర్శి జనన ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వగలరు. ఆ తర్వాతే పుట్టిన తేదీలు, పేర్ల మార్పులు జరిగి అపార్ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఈ విషయాలు తెలియని తల్లిదండ్రులు అక్కడ ఇక్కడ తిరగాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపార్ నమోదు ప్రక్రియ కోసం ఆధార్‌లో పుట్టిన తేదీలో తప్పులు సవరించాలంటే గగనమవుతోందంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనన ధ్రువీకరణ పత్రానికి అవస్థలు

జనన ధ్రువీకరణ పత్రాన్ని పొందాలంటే నోటరీ చేయించాలి. పంచాయతీ కార్యదర్శి నుంచి నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్ తీసుకోవాలి. వాటన్నింటినీ కలిపి జనన ధ్రువీకరణ పత్రం కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని మళ్లీ ఆర్డీఓ కార్యాలయం వరకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి సంబంధించిన పని జరగాలంటే విద్యార్థి తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొంత మంది అధికారులు చేతులు తడిపితే కాని పనులు జరగడం లేదనే విమర్శలూ బాహాటంగానే వినిపిస్తున్నాయి.

> **సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నం:** ఆధార్, పాఠశాల రికార్డులకు తేడాలు ఉన్నందున విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇబ్బందులు పడకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మండలంలో మూడు ఆధార్ సెంటర్లు ఉండగా రెండింటిలో టెక్నికల్ సమస్య ఉంది. బద్వీడుచెర్లోపల్లిలో ఆధార్ సెంటర్ పని చేస్తోంది. మండలంలో మొబైల్ ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను కోరాం.
>
> – ఎస్‌వీసీహెచ్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ-2

ప్రభుత్వ వ్యవస్థల్లో పెట్టుబడి పెట్టాలి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



పోస్టాఫీసు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

● ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ప్రభుత్వ వ్యవస్థల్లో పెట్టుబడులు పెడితే తమ కుటుంబానికి పెట్టుబడి పెట్టినట్లేనని, ప్రైవేటు రంగ సంస్థల్లో పెట్టుబడులు పెడితే కుటుంబాలు నాశనం అవుతాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హెచ్చరించారు. శనివారం స్థానిక వాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన సబ్ పోస్టాఫీసు భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో నడుస్తున్న పోస్టల్ శాఖలో అవినీతి జరిగితే కేంద్రం సమాధానం చెప్పాల్సి వస్తుందని, ఎంతో పగడ్బందిగా గత 150 సంవత్సరాల నుంచి పోస్టల్ శాఖ కోట్లాది మంది ప్రజలకు సేవలు అందిస్తోందని, అటువంటి సంస్థను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రపంచ చరిత్రలో దేశ పోస్టల్ శాఖ అతిపురాతనమైందని, కాలానుగుణంగా బ్యాంకులతో పోటీ పడుతూ ఆ శాఖ ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు.

జర్నలిస్టులకు పోస్టల్ బీమా చెల్లిస్తా..

ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఇష్టంగా పని చేసే జర్నలిస్టులకు పోస్టల్ వ్యవస్థలో తాను బీమా ప్రీమియం చెల్లిస్తానని ఎమ్మెల్యే తాటిపర్తి ప్రకటించారు. జర్నలిస్టులు వార్తలు సేకరించే క్రమంలో దూర ప్రాంతాలకు వెళ్తుంటారని, అటువంటి తరుణంలో ప్రమాదాలు జరిగితే వారి కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉందన్నారు. జర్నలిస్టులను ఆదుకునేందుకు తాను ఈ నిర్ణయం తీసుకున్నానని, పోస్టాఫీలో ఉండే బీమా వారికి వర్తించే విధంగా ప్రీమియం చెల్లిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ ఎండీ జాఫర్ సాధిక్, మార్కాపురం డివిజనల్ సూపరింటెండెంట్ జేవీ శ్రీనివాసులు, శాఖ పోస్టుమాస్టర్ కిరణ్‌కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన అయ్యప్పలు

త్రిపురాంతకం: మండల కేంద్రం త్రిపురాంతకం నుంచి యర్రగొండపాలెం వెళ్లే రహదారిలో సాగర్ కాలువపై వంతెనకు ఇరువైపులా ఉన్న గుంతలను అయ్యప్ప స్వాములు శనివారం మట్టితో పూడ్చి వేశారు. వంతెనకు ఇరువైపులా గుంతలు పడటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి పార్వతీ త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాలకు ఇదే రహదారి ఉండటంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్న రోడ్డుపై గోతులు పూడ్చే పరిస్థితి లేకపోవడంతో స్థానికంగా ఉన్న అయ్యప్ప స్వాములు గోతులను శ్రమదానం చేసి మట్టితో పూడ్చారు. వాహనదారులు అయ్యప్ప స్వాములను అభినందించారు.



గుంతలు పూడ్చుతున్న అయ్యప్ప స్వాములు

గ్రంథాలయ నిర్మాణానికి నిధుల కొరత



గ్రంథాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న కాసు ఆదిలక్ష్మి

తాళ్లూరు: గ్రంథాలయం నిర్మాణానికి నిధుల కొరత ఉందని జిల్లా గ్రంథాలయం శాఖ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. తాళ్లురులోని గ్రంథాలయం స్థలాన్ని ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ దాతల సహకారంతో అందించిన స్థలంలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం ఉన్నాయని, ప్రభుత్వం నుంచి గ్రంథాలయానికి అందాల్సిన నిధులు అందక పోవడంతో గ్రంథాలయం నిర్మాణ పనులు ఆగి పోయాయన్నారు. దాతలు ముందుకు వచ్చి నిధులు అందజేస్తే గ్రంథాలయ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసి తాళ్లూరు ప్రజలు, విద్యార్థులకు గ్రంథాలయ సదుపాయాలు వినియోగంలోకి తీసుకురావచ్చని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ



గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కార్యదర్శి ఆదిలక్ష్మి

ముండ్లమూరు (దర్శి): స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయం శాఖ నుంచి వచ్చిన పుస్తకాలు పరిశీలించారు. రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయ సెస్ బకాయిలు సంబంధిత అధికారులు వారానికి ఒక్కసారైనా వెళ్లి వసూలు చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. గ్రంథాలయ సభ్యత్వం నెల టార్గెట్‌లు ఇచ్చిన వరకు కొరవలు లేకుండా పూర్తి చేయాలన్నారు. గ్రంథాలయ స్థల సేకరణకు కృషి చేయాలని సూచించారు.

25 మంది ఉద్యోగాలకు ఎంపిక



జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు 27 మంది నిరుద్యోగులు హాజరు కాగా 25 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ నగేష్, స్కిల్ హబ్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఎస్.రమేష్ తెలిపారు. ఐసన్ ఎక్స్‌పీరియన్స్, డీ మార్ట్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ విజయవాడ, ప్రకాశం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి.

ఖదర్‌బాషా సేవలు మరువలేనివి



సన్మానం అందుకుంటున్న ఖాదర్‌బాషా దంపతులు

దర్శి: డిగ్రీ కళాశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సయ్యద్ ఖాదర్‌బాషా సేవలు మరువలేనివని ఆ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణ అన్నారు. శనివారం సయ్యద్ ఖాదర్‌బాషా పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన దంపతులను కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎన్‌వీ రమణ మాట్లాడుతూ 22 ఏళ్ల సుదీర్ఘ సేవలందించి రిటైర్మెంట్ అవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

యర్రగొండపాలెం: స్థానిక మేజర్ పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగాయని వచ్చిన ఆరోపణలపై అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ఈ విచారణ మరో 5 రోజుల వరకు కొనసాగుతుందని త్రి సభ్య కమిటీ సభ్యుడు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు.

తిరుమలనాథస్వామికి విశేష పూజలు



తిరుమలనాథస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన కలియుగ దైవం శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామికి కార్తిక మాసం సందర్భంగా భక్తిశ్రద్ధలతో భక్తులు విశేష పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, తదితర పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, అభరణాలు ధరించి పూలమాలతో అలంకరించారు. సంతానం లేని దంపతులు ఆలయం వెనుక ఉన్న గిరికొండ చుట్టూ భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేశారు. మహిళలు నైవేద్యం తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి అయప్ప మాల ధరించిన స్వాములు, భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

చందవరంలో గ్రామసభలు



మాట్లాడుతున్న ఏపీఓ దేవయ్య

దొనకొండ: మండలంలోని చందవరం, పోలేపల్లి గ్రామాల్లో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామసభలు నిర్వహించారు. గ్రామ పంచాయతీలకు 2025–26 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ నివేదిక గ్రామసభలో చర్చించారు. చందవరం గ్రామానికి రూ.60 లక్షల పనులు గుర్తించి తీర్మానించారు. గ్రామంలో కుంటలు, చెక్‌డ్యామ్‌లు, రైతులకు పండ్ల మొక్కలు, చెరువులో పూడికతీత వగైరా పనులకు సంబంధించి గ్రామసభలో ఆమోదించారు. గ్రామంలోని రైతుల కోరిక మేరకే గ్రామాభివృద్ధికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కేటాయిస్తామని ఏపీఓ టి.దేవయ్య తెలిపారు. నివేదిక జాబితాను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. వారి ఆదేశాల మేరకు మార్చి నుంచి పనులు ప్రారంభిస్తామని ఏపీఓ దేవయ్య తెలిపారు.

వన భోజనాలతో స్నేహభావం



ఎస్‌ఐ సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



భోజనాలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పుల్లలచెరువు: ఆధ్యాత్మిక, స్నేహ భావం పెరిగేందుకు కార్తీక వన భోజనాలు అవసరమని ఎస్‌ఐ సంపత్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో కార్తీకవన భోజనాలను చౌటపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఎస్‌ఐ సంపత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక వన మహోత్సవాలతో ఆధ్యాత్మిక భావాలు, సభ్యుల మధ్య సోదర భావాలు పెంపొందుతాయని, సామాజిక సేవా రంగాల్లో అగ్రస్థానంలో నిలిచి అందరికీ ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



పెద్దదోర్నాల: అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



దర్శి: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

దర్శి: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధికాదని చెప్పారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను అవమానంగా చూడకూడదన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ యాక్టివిటీస్ ముగిసిన నేపథ్యంలో శనివారం ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. సీసీఈ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. విద్యార్థులకు మూడు రోజుల పాటు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఎలా సోకుతుంది.. దాని నివారణ మార్గాలు, ఎయిడ్స్ వ్యాధితో కలిగే నష్టాలు యువత తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌బాబు, జయసింహ, రమేష్, అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయం, పోషక విలువలపై శిక్షణ



గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని బోడుగూడెంలో దర్శికి చెందిన కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ సూచనలతో అపరాలు, పోషక విలువలు, సుస్థిర వ్యవసాయంలో గిరిజన రైతులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీకే నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ మానస, సెంటర్ ఫర్ వరల్డ్ సోలిడారిటీ (సీడబ్ల్యూఎస్) సంస్థ కమ్యూనిటీ మొబలైజర్ బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అపరాల విత్తనశుద్ధి, చిరు ధాన్యాల పోషక విలువలపై అవగాహన కల్పించారు. దీంతో పాటు సమగ్ర చీడపీడల నివారణ కోసం చిగురు అట్టలు, కిరమేన్ డ్రాప్స్‌ను అందజేశారు. గిరిజన రైతులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కంది, మిరప, బత్తాయి, శనగ, బంతిపూల పంటలను సందర్శించారు. కందిలో పూత చుట్టు పురుగు నివారణకు, మిరపలో పూతనల్లి, మజ్జిగ మచ్చ తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు అందజేశారు. మినుము, బొబ్బర్లు పంట వేసుకునే వారికి ట్రైబల్ సబ్ ప్లాన్ (టీయస్‌పీ) కింద విత్తనాలు పంపిణీ చేశారు. సీడబ్ల్యూఎస్ సంస్థ సిబ్బంది, గిరిజన రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ఓబీ అధ్యక్షురాలిగా సుజాత



నూతన కమిటీని పరిచయం చేస్తున్న అధికారులు

తాళ్లూరు: మండల మహిళా సమాఖ్య ఓబీ అధ్యక్షురాలిగా ఎం.సుజాతను ఎన్నుకున్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళా వెలుగు శ్రీనిధి మేనేజర్ పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో మండల సమాఖ్య జనరల్ బాడీ సభ్యుల నూతన కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. ఉపాధ్యక్షురాలిగా సి.లీల, కార్యదర్శిగా షేక్ బీబీజాన్, సహకార కార్యదర్శిగా పి.ధనలక్ష్మి, కోశాధికారిగా ఎస్.భాగ్యలక్ష్మి, నూతన సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏసీ వసుంధరాదేవి, ఏపీఎం దేవరాజు, సీసీ సుచంద్ర, గ్రామ సభ్యులు పాల్గొన్నారు.